సాక్షి నంద్యాల

మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023




ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు

శ్రీశైలంటెంపుల్: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన మోహినీ భస్మాసుర, శ్రీసత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శనలు, నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



హోరాహోరీగా..

బండిఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో సోమవారం రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను తిలకించేందుకు రైతులు భారీగా తరలివచ్చారు.



హజ్‌కు దరఖాస్తులు

హజ్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. మార్చి 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఏటా వేల మంది హజ్ యాత్రకు వెళ్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ఇళ్ల పట్టాలను జియో ట్యాగింగ్ చేయండి



లే అవుట్లను పరిశీలిస్తున్న డీఈ ప్రభాకర్

కొత్తపల్లి: జగనన్న లే అవుట్లలో ఇళ్ల పట్టాలను జియో ట్యాగింగ్ చేయాలని హౌసింగ్ డీఈ ప్రభాకర్ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. సోమవారం ఆయన కొత్తపల్లిలోని జగనన్న లే అవుట్లను పరిశీలించి గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుడా పరిధిలో మండలంలో 957 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు కాగా 278 మంది నిర్మాణాలకు ముందుకొచ్చారన్నారు. సమావేశంలో ఎంపీడీఓ మేరి, ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు, హౌసింగ్ ఏఈ పాండు నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మురళీ, ఆయా గ్రామాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సున్నిపెంట పోలీస్‌స్టేషన్ తనిఖీ



పోలీస్ అవుట్‌పోస్ట్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి సోమవారం సున్నిపెంట పోలీస్ అవుట్ పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించడంతో పాటు అవుట్ పోస్ట్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్‌ఐ గంగయ్య యాదవ్‌ను ఆదేశించారు. తెలంగాణ నుంచి మద్యం అక్రమ రవాణా, సారా తయారీని అరికట్టాలన్నారు.

అటవీ చెక్ పోస్టు వేళలు మార్చాలని వినతి



మంత్రిని కలిసిన మర్చంట్స్ అసోసియేషన్, ప్రజా సంఘాల నాయకులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఘాట్‌లో అటవీ చెక్ పోస్టు వేళలు మార్చాలని రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి స్థానిక మర్చంట్స్ అసోసియేషన్, ప్రజా సంఘాల నాయకులు విన్నవించారు. మల్లన్న దర్శనార్థం సోమవారం శ్రీశైలం వచ్చిన మంత్రికి స్థానిక సమస్యలపై వినతి పత్రం అందజేశారు. శ్రీశైలం, సున్నిపెంట వాసులు అత్యవసర సమయాల్లో ఇతర ప్రాంతాలకు రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. రాత్రి 11 గంటల వరకు, ఉదయం 4 గంటల నుంచి వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఆయా సంఘాల నాయకులు చిన్ని శ్రీనివాసరావు, కలువ శ్రీనివాసులు, ఆశీర్వాదం, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

పశువైద్యశాలలకు ఐస్‌ల్యాండ్ రిఫ్రిజిరేటర్లు



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని 40 పశు వైద్యశాలలకు ప్రభుత్వం ఐస్ ల్యాండ్ రిఫ్రిజిరేటర్లు మంజూరు చేసింది. మొత్తం 66 వెటర్నరీ డిస్పెన్సరీలు ఉండగా.. సొంత భవనాలు, విద్యుత్ సదుపాయం ఉన్న 40 పశువైద్యశాలలకు వీటిని సరఫరా చేయనున్నట్లు జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ రామచంద్రయ్య తెలిపారు. ఒక్కో రిఫ్రిజిరేటర్ ధర రూ.2.04 లక్షల ఉంటుందని, ఇందులో వ్యాక్సిన్‌ను భద్రపరచుకోవచ్చన్నారు.

మూడో రోజు 'స్థానిక' నామినేషన్లు నిల్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా స్థానికసంస్థల ఎన్నికకు సంబంధించి మూడో రోజూ కూడా ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. రెండు రోజుల తరువాత వరుసగా శని, ఆదివారాలు సెలవు రావడంతో నామినేషన్లకు విరామం ప్రకటించారు. మూడో రోజు సోమవారం కూడా ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. ఫిబ్రవరి 23వ తేదీ వరకు నామినేషన్లను దాఖలు చేసే అవకాశం ఉంది.

పట్టభద్రుల స్థానానికి జిల్లా వాసి నామినేషన్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి జిల్లాకు చెందిన రాగిరి చంద్రప్ప నామినేషన్ వేశారు. సోమవారం అనంతపురంలో రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జి కలెక్టర్ కేతన్ ఖర్గ్‌కు ఒక్క సెట్ నామినేషన్‌ను అందజేశారు.



☛ ఈ ఫొటోలోని మహిళ పేరు జయమ్మ. కొలిమిగుండ్లవాసి. భర్త నారాయణ పొలం పనులతో పాటు నాపరాయి గనుల్లో కూలికి వెళ్తుండగా, జయమ్మ వ్యవసాయ పనులు చేసుకుంటోంది. వీరికి ముగ్గురు పిల్లలు సంతానం కాగా, పాఠశాలకు వెళ్తున్నారు. ప్రభుత్వ భూమిలో కంపచెట్లు తొలగించి పంటల సాగు చేసుకుంటుండగా.. 8వ విడత భూ పంపిణీలో ఎకరానో, అర ఎకరానో ఇచ్చేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి భూ పంపిణీ జరగకుండా కోర్టులో పిల్ దాఖలు చేశారు.

.. ఈ ఇద్దరే కాదు, బనగానపల్లె నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లోని 8,325 మంది నిరుపేదల వేదన ఇది.



☛ ఈమె పేరు లక్షుమ్మ. కొలిమిగుండ్లలోనే నివాసం ఉంటున్న ఈమె ఏళ్ల తరబడి పొలం పనులతో పాటు గని పనికి వెళ్తోంది. భూములన్నీ సిమెంట్ ఫ్యాక్టరీలకు పోగా, బతుకుదెరువుకు కూలి తప్ప మరో దారిలేదు. ఇటిక్యాలలో బంజరు ఉంది. కూడబెట్టుకున్న డబ్బుతో కంపచెట్లు కొట్టుకుని పొలం సాగుకు సిద్ధం చేసుకుంది. ఈ నేపథ్యంలో బీసీ జనార్దన్‌రెడ్డి భూ పంపిణీని అడ్డుకోగా, తమ బతుకు రోడ్డున పడేశారని కన్నీరుమున్నీరవుతోంది.

పేరులో బీసీ.. పేదల ద్రోహి!

భూ పంపిణీపై కోర్టులో బీసీ జనార్దన్‌రెడ్డి పిల్

- నిరుపేదల జీవితాలతో చెలగాటం
- గతంలో ఇంటిపట్టాలు ఇవ్వకుండా అనుచరులతో కోర్టు కేసు
- కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లో రోజు కూలీలుగా వేలాది కుటుంబాలు
- కష్టపడిన దాచుకున్న డబ్బుతో బంజరు భూముల్లో సాగుకు ఏర్పాట్లు
- అధికారులకు వేలాది మంది దరఖాస్తు
- తాజాగా భూపంపిణీకి సిద్ధం కాగా మాజీ ఎమ్మెల్యే అడ్డంకులు



బీసీ జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జేసీబీల ద్వారా అక్రమ మైనింగ్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి కర్నూలు: బనగానపల్లె నియోజకవర్గంలో నాపరాయి గనులు ఎక్కువ. ఈ నేపథ్యంలో పట్టా భూములు, గతంలో పేదలకు పంపిణీ చేసిన డీ-పట్టా భూములను ఈ ప్రాంతంలో ఏర్పాటైన రామ్‌కో, అల్ట్రాటెక్ సిమెంట్ సిమెంట్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు వేల ఎకరాలు కొనుగోలు చేశాయి. ఇవి కాకుండా ప్రభుత్వ భూములు కూడా 40వేల ఎకరాల వరకూ ఫ్యాక్టరీలకు ఇచ్చారు. సోలార్‌ప్లాంటుకు 10వేల ఎకరాలు కేటాయించారు. వైఎస్సార్ జిల్లా వద్దిరాల సమీపంలోని దాల్మియా సిమెంట్స్‌కు కొలిమిగుండ్ల మండలంలో.. అనంతపురం జిల్లాలోని పెన్నా సిమెంట్స్‌కూ ఇక్కడే భూములిచ్చారు. అలాగే ప్రముఖ టైల్స్ కంపెనీ జాన్సన్ ఏర్పాటు చేస్తోన్న త్రిజం సిమెంట్స్‌కు ఈ ప్రాంతంలోనే భూములు కేటాయించారు. దీంతో ఈ మండలాల్లో వ్యవసాయం అనేది లేకుండా పోతోంది. వ్యవసాయ భూములు కూడా బాగా తగ్గిపోయి పేదల బతుకు భారమైంది.

జీవితాంతం గనుల్లో కూలీలుగానే..

కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లోని చాలా గ్రామాల ప్రజలు గనుల్లో రోజు కూలికి వెళ్తారు. మహిళలు కూడా దీనిపై ఆధారపడాల్సిందే. గనుల్లో పనులు లేకపోతే మండలంతో పాటు ఇతర ప్రాంతాలకు వ్యవసాయ పనులకు వెళతారు. ఇవే వీరి జీవనోపాధి. రోజంతా శ్రమించినా వచ్చే సొమ్ము అరకొరగానే ఉంటుంది. ఏళ్ల తరబడి పేదల బతుకులు ఇలానే ఉన్నాయి. ఈ విషయం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గ్రహించారు. పైగా ఈ మండలంతో పాటు ఇతర మండలాల్లో ప్రభుత్వ బంజరు భూములు అధికంగా ఉన్నాయి. కొంతమంది పేదలు ఏళ్లుగా బంజరు భూములను సాగు చేసుకుంటున్నారు. దీంతో సాగులోని భూములను పేదలకు ఇచ్చేందుకు వైఎస్‌ఆర్ భూపంపిణీకి శ్రీకారం చుట్టి పట్టాలిచ్చారు. ఇప్పటి వరకూ ఏడు విడతల భూ పంపిణీ చేశారు. ఈ క్రమంలో కొలిమిగుండ్ల మండలంలోని కల్వటాల, కోటపాడు, గొర్విమానుపల్లి, తిమ్మనాయినిపేట, బెలుం, తమ్మలపెంట, బి. తాడిపత్రి, నందిపాడు, మీర్జాపురం, హనుమంతుగుండం, పెద్దవెంతుర్ల, ఎర్రగుడి, కొలిమిగుండ్లతో పాటు పలు గ్రామాల ప్రజలు గడపగడపతో పాటు ఇతర కార్యక్రమాలకోసం పల్లెలకు వెళ్లిన సమయంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి తమ పరిస్థితి విన్నవించారు. దశాబ్దాలుగా పేదలు పడుతున్న కష్టాలను ఎమ్మెల్యే కూడా స్వయంగా చూస్తున్నారు. దీంతో అధికారులతో మాట్లాడి ఎనిమిదో విడత భూ పంపిణీ ద్వారా భూమి లేని పేదలకు అరెకరం నుంచి ఎకరా వరకూ ఇవ్వాలని సూచించారు. పేదలు కూడా తహసీల్దార్‌కు అర్జీలు పెట్టుకున్నారు. దీంతో అధికారులు సర్వే చేసి భూ పంపిణీ చేయాలని నిర్ణయించారు. 8,325 ఎకరాలను పంపిణీ చేసేందుకు ఉపక్రమించారు.

భూ పంపిణీ జరగకుండా బీసీ జనార్దన్‌రెడ్డి పిల్

అర్హులైన పేదలకు భూ పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఈ భూములపై ఈ నెల 12న కోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ భూములన్నీ మైనింగ్‌కు అనుకూలమైనవని, ఇందులో ఖనిజ సంపద ఉందని, ఇలాంటి విలువైన భూములను పంపిణీ చేసి ప్రభుత్వానికి అధికారులు నష్టం చేస్తున్నారనే కారణం చూపి పిల్ వేశారు. గతంలో కూడా 3,200 మందికి 110 ఎకరాల్లో ఇంటిపట్టాలు ఇస్తుంటే దానిపై కూడా కేసు వేయించారు. ఇలా ప్రతీ అంశంలో పేదలకు వ్యతిరేకంగా బీసీ అడుగులు వేస్తున్నారు. పేదల బతుకులపై దెబ్బ వేయడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. వారి జీవితాల్లో చిమ్మచీకట్లు నింపుతున్నారు. దీనిపై బాధితులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ.. ప్రజా సంఘాలు సోమవారం ఆందోళన చేపట్టాయి. మండలంలో ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు సమర్పించాయి. ఏ ప్రజా నాయకుడు కూడా భూ పంపిణీని అడ్డుకోలేదని, మొదటిసారి బీసీ పేదలకు వ్యతిరేకంగా పంపిణీని అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



కొండలను కరిగించి.. కోట్లు గడించి

బీసీ జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మొలాలికొండ(రవ్వలకొండ) ప్రాంతంలో అక్రమ మైనింగ్ జరిపారనే ఆరోపణలు ఉన్నాయి. ఈయనకు ఉన్న క్రషర్ ద్వారా భారీగా కంకర కొల్లగొట్టి కోట్లు గడించారని స్థానికులు చర్చించుకుంటున్నారు. మోడల్ స్కూలు, అక్కడి హాస్టల్ విద్యార్థులకు క్రషర్ ద్వారా వచ్చే కాలుష్యంతో ఇబ్బంది కలిగి అప్పట్లో విద్యార్థి సంఘాలు ఆందోళనలు కూడా చేశాయి. ఇతనిపై హైదరాబాద్‌లో కూడా భూదందా కేసులు ఉన్నాయి. 22 కేసులు బీసీపై ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా అక్రమంగా కోట్లు గడించిన బీసీకి పేదల బతుకులపై, వారు బతికేందుకు ఇచ్చే ఎకరా, అరెకరా భూములను అడ్డుకోవడంపై నియోజకవర్గంలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

> **అర్హులైన వారికి నిబంధన మేరకు భూములిస్తాం**
>
> భూముల కోసం పేదలు అర్జీలు పెట్టుకున్నారు. సాగులో ఉన్నామని పట్టాలివ్వాలని కోరారు. ఇంకొందరు బంజరుభూమిని పంపిణీ చేయాలని అభ్యర్థిస్తున్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే కోర్టులో పిల్ వేశారు. నిబంధనల మేరకు పై అధికారులను సంప్రదించి కోర్టు ఉత్తర్వులకు లోబడి అర్హులైన వారికి భూపంపిణీ చేస్తాం.
>
> – ఆల్‌ఫ్రెడ్, తహసీల్దార్, కొలిమిగుండ్ల

మండలి ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో సమావేశమైన పార్టీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, బీవై రామయ్య. చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి

- పట్టభద్రులు, యువత వైఎస్సార్‌సీపీ వైపే
- చేసిన మంచిని వివరిద్దాం
- వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపిద్దాం
- ప్రజాప్రతినిధుల సమావేశంలో పార్టీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని, రామయ్య

కర్నూలు(రాజ్‌విహార్): శాసన మండలి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య అన్నారు. సోమవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి రాష్ట్రంలోని నిరుద్యోగులకు 4 లక్షల ఉద్యోగాలు ఇచ్చారన్నారు. అర్హతే ప్రామాణికంగా ఇంటి వద్దనే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పట్టభద్రులతో పాటు యువత వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శాసన మండలి ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్‌సీపీదేనని తెలిసి ఎల్లో మీడియా ద్వారా టీడీపీ నేతలు విషప్రచారం చేస్తున్నారని, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టీడీపీ అధినేత చంద్రబాబు గిమ్మిక్కులను తిప్పికొట్టాలన్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా దృష్టి సారించి, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, శాసన మండలి సభ్యులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, సి. ఇసాక్ బాషా, ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, రవిచంద్రకిశోర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, కంగాటి శ్రీదేవి, తొగురు ఆర్థర్, ఎంఎ హఫీజ్‌ఖాన్, డాక్టర్ సుధాకర్, కాటసాని రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23 వరకు ఓటరు నమోదుకు అవకాశం

కర్నూలు(సెంట్రల్): త్వరలో జరగబోయే పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఇప్పటివరకు ఓటరుగా నమోదు కానివారు ఫిబ్రవరి 23లోపు ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు ఇస్తే ఓటు హక్కును పొందే అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని డిగ్రీ పూర్తి చేసుకున్న పట్టభద్రులు, ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నవారు సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల సంఘం కోరింది.

వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు సిటీ: ఇంటర్మీడియట్ వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా కేంద్రంగా 32 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలను నిర్వహించారు. ఉదయం 32 కేంద్రాల్లో 1,940 మంది విద్యార్థులకుగాను 1756 మంది, మధ్యాహ్నం 31 కేంద్రాల్లో 1,641 మందికి గాను 1,541 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు నెల రోజులకు ముందుగానే సూచించారు. అయితే చాలా చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. ఆర్‌ఐఓ గురవయ్యశెట్టి కర్నూలులోని ఓ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

'స్థానిక' ఎమ్మెల్సీ అభ్యర్థిగా మధుసూదన్

- ప్రకటించిన వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం
- వాల్మీకి సామాజిక వర్గానికి మరోసారి అవకాశం
- గెలుపు నల్లేరుపై నడకే



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మధుసూదన్

కర్నూలు(రాజ్‌విహార్): శాసన మండలి ఎన్నికల్లో వెనుకబడిన సామాజిక వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రాధాన్యత ఇచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆదోనికి చెందిన డాక్టర్ మధుసూదన్ పేరును ఖరారు చేసింది. ఆదోని పట్టణానికి చెందిన ఈయన వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు.. బ్యాక్ బోన్ క్లాస్ అని చెప్పుకొస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణలో కూడా చేసి చూపుతున్నారు. వెనుకబడిన కులాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూనే... బీసీల అభ్యున్నతి కోసం ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అవకాశాలు కల్పిస్తూ వస్తున్నారు. అందులో భాగంగానే 139 కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి 672 డైరెక్టర్ పోస్టులను కేటాయించారు. దీంతో అన్ని కులాలు సమానంగా అభివృద్ధి చెందుతున్నాయి. బీసీలను రాజకీయ అవసరాల కోసం వాడుకున్న చంద్రబాబు.. ఎన్నికల ముందు భజన చేసి తరువాత విస్మరిస్తున్నారు. అయితే సీఎం జగన్ చెప్పినవి, చెప్పనివి కూడా చేస్తూ వస్తున్నారు. దీంతో అణగారిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కులాలు కూడా అన్ని రంగాల్లో గుర్తింపు పొందుతున్నాయి. స్థానిక సంస్థల శాసన మండలి అభ్యర్థిగా ఖరారు అయిన డాక్టర్ మధుసూదన్ ప్రస్తుతం రాష్ట్ర బోయ/వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్నారు.

గెలుపు నల్లేరుపై నడకే..

శాసన మండలి ఎన్నికల్లో పోటీ చేసేందుకు టీడీపీ వెనకాడుతున్నట్లు తెలుస్తోంది. బలం లేని కారణంగా పోటీ చేస్తే ఘోర ఓటమి తప్పదని ఆ పార్టీ నేతల్లో చర్చ జరుగుతోంది. ఒకవేళ పోటీ చేస్తే డిపాజిట్ కూడా దక్కదని చెప్పుకుంటున్నారు. స్థానిక సంస్థల్లో అత్యధిక శాతం వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తున్న కారణంగా డాక్టర్ మధుసూదన్ గెలుపు నల్లేరుపై నడకే కానుంది.

మధుసూదన్ బయోడేటా

- పేరు : డాక్టర్ అలంపూర్ మధుసూదన్
- తల్లిదండ్రులు : తండ్రి ఏబీ మద్దిలేటి (ఆడిట్ ఆఫీసర్), తల్లి మద్దమ్మ.
- కులం : బోయ/వాల్మీకి
- కుటుంబ సభ్యులు : భార్య డాక్టర్ బీటీ పద్మావతి, గైనకాలజిస్టు, అబ్బాయిలు విశ్వతేజ (లండన్‌లో ఎంఎస్), చైతన్య మిత్ర (స్కాట్‌లాండ్).
- స్వగ్రామం : అల్లూరు గ్రామం, నందికొట్కూరు మండలం.
- పుట్టిన తేదీ : 1-7-1963.
- పుట్టిన ఊరు : అల్లూరు.
- చదువు : ఎంబీబీఎస్, డిప్లొమా ఇన్ డయాబెటాలజీ

బ్రహ్మోత్సవ యాగ క్రతువులకు పూర్ణాహుతి

- శాస్త్రోక్తంగా చండీశ్వరునికి త్రిశూల స్నానం
- నేటితో ముగియనున్న మల్లన్న బ్రహ్మోత్సవాలు



ఆలయ పుష్కరిణిలో చండీశ్వరునికి త్రిశూల స్నానం నిర్వహిస్తున్న చైర్మన్, ఈఓ, పండితులు



ధ్వజావరోహణ చేస్తున్న దృశ్యం

శ్రీశైలం టెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో వైభవంగా నిర్వహించిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవ క్రతువులకు పూర్ణాహుతి నిర్వహించారు. 10వ రోజు సోమవారం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజాధికాలను నిర్వహించారు. స్వామివారి యాగశాలలో వేదపండితులు చండీశ్వరునికి ప్రత్యేక పూజలు జరిపారు. తదుపరి రుద్రహోమ పూర్ణాహుతి, వసంతోత్సవం, అవభృదం, త్రిశూలస్నానం కార్యక్రమాలు నిర్వహించారు. పూర్ణాహుతిలో శాస్త్రోక్తంగా నారికేళాలు, పలు సుగంధ ద్రవ్యాలు, ముత్యం, పగడం, నూతన వస్త్రాలు వంటి పూజాద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించారు. వసంతోత్సవంలో అర్చకులు, పండితులు వసంతాన్ని (పసుపు, సున్నం కలిపిన మంత్రపూరిత జలం) సమంత్రకంగా భక్తులపై ప్రోక్షించారు. చండీశ్వరుడికి పుష్కరిణి వద్ద ఆగమశాస్త్రబద్ధంగా స్నానాధికాలు జరిపారు. చివరిగా త్రిశూలస్నానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవాల ముగింపు సూచికంగా ఆలయ ప్రధాన ధ్వజస్తంభంపై ఉన్న ధ్వజపటాన్ని అవరోహణ చేశారు.

సదస్యం–నాగవల్లి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో స్వామివారి నిత్యకల్యాణ మండపంలో సదస్యం–నాగవల్లి కార్యక్రమాలు నిర్వహించారు. సదస్యం కార్యక్రమంలో వేదపండితులచే వేదస్వస్తి నిర్వహించారు. నాగవల్లి కార్యక్రమంలో మహాశివరాత్రి రోజున కల్యాణోత్సవం జరిపించిన భ్రమరాంబాదేవికి ఆగమశాస్త్రం సంప్రదాయం మేరకు మెట్టెలు, నల్లపూసలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న దంపతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అశ్వవాహనసేవ

బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు మంగళవారం సాయంత్రం భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివారికి అశ్వవాహనసేవ నిర్వహిస్తారు. అనంతరం పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ నిర్వహిస్తారు. ఆయా కార్యక్రమాలు పూర్తవడంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



శ్రీశైలంలో గవర్నర్

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనార్థం శ్రీశైలం చేరుకున్న రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ దంపతులకు జిల్లా, దేవస్థానం అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న గవర్నర్‌కు ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈఓ లవన్న, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల దర్శన అనంతరం గవర్నర్ దంపతులకు చైర్మన్, ఈఓ స్వామి వారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపిక అందజేసి సత్కరించారు.



హర హర మహాదేవ!

నల్లమల పచ్చని అందాల నడుమ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి రథంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. సోమవారం మహానంది క్షేత్రంలో రథోత్సవం కనుల పండువగా సాగింది. అశేష భక్తజనం స్వామి వారిని దర్శించుకుని పునీతులయ్యారు. – మహానంది



కాల్వబుగ్గ దేవస్థానంలో సోమవారం సాయంత్రం శ్రీ భ్రమరాంబా బుగ్గరామేశ్వర స్వాముల రథోత్సవం కనుల పండువగా సాగింది. అశేష భక్తజన సందోహం మధ్య తరలిపోతున్న స్వాముల రథంపైకి పూలు, పండ్లు విసురుతూ ప్రజలు భక్తిభావాన్ని చాటుకున్నారు. ఉత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– ఓర్వకల్లు



నమో.. బ్రహ్మేశ్వరా!

భక్తుల శివనామస్మరణతో బ్రహ్మగుండం క్షేత్రం మార్మోగింది. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం గంగా, గౌరీ సమేత బ్రహ్మేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. భక్తులు స్వామి వారిని దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు. – వెల్దుర్తి

రుద్రవరం చేరిన పార్వేట



పల్లకీకి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

రుద్రవరం: అహోబిలేశుడి పార్వేట పల్లకీ సోమవారం రాత్రి మండల కేంద్రమైన రుద్రవరానికి చేరుకుంది. సర్పంచ్ విజయలక్ష్మి, రుద్రవరం రేంజి అధికారి శ్రీపతి నాయుడు, వీఆర్వో వెంకటరమణ, గ్రామ పెద్దలు పల్లకీకి స్వాగతం పలికారు. గ్రామ శివారులోని కేజీబీవీ పాఠశాల ప్రాంగణంలోని తెలుపు మీదకు చేరుకోగా.. ఉత్సవ మూర్తులు జ్వాలా నరసింహ స్వామి, ప్రహ్లాదవరద స్వామికి ప్రజలు మొక్కులు తీర్చుకున్నారు.

సెపక్‌తక్రా విజేత కర్నూలు



విజేతగా నిలిచిన కర్నూలు జిల్లా జట్టు

ఉరవకొండ: రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు జయకేతనం ఎగురవేసింది. అనంతపురం జిల్లా ఉరవకొండలోని పోలీసు క్రీడామైదానం వేదికగా ఈ నెల 19న ప్రారంభమైన అండర్ 14, 17 బాలురు, బాలికల రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు సోమవారం ముగిశాయి. పది జిల్లాల జట్లు ప్రాతినిధ్యం వహించగా.. డే అండ్ నైట్ మ్యాచ్‌లు నిర్వహించారు. అండర్–14 బాలుర విభాగం ఫైనల్ మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై కర్నూలు జట్టు విజయం సాధించింది. అండర్–14 బాలికల విభాగంలో అనంతపురం జట్టుపై పశ్చిమ గోదావరి, అండర్–17 బాలుర విభాగంలో అనంతపురం జిల్లా జట్టుపై పశ్చిమ గోదావరి జిల్లా జట్టు, అండర్–17 బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు ట్రోఫీలను గుత్తి డిప్యూటీ డీఈఓ శంకరప్రసాద్, సీఐ హరినాథ్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీడీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, జిల్లా కార్యదర్శి మొరార్జీయాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

హజ్ యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

- మార్చి 10వ తేదీ ఆఖరు

కర్నూలు(రాజ్‌విహార్): హజ్ ఎంతో పుణ్యప్రదమైంది. ఆర్థిక స్థోమత కలిగిన ముస్లిం స్త్రీ, పురుషులు జీవిత కాలంలో ఒక్కసారైనా హజ్ చేయాలని పవిత్ర గ్రంథం 'ఖురాన్' సూచిస్తోంది. త్యాగానికి ప్రతీకగా జరుపుకునే 'బక్రీదు' పండుగ రోజున సౌదీ అరేబియాలోని పుణ్య మక్కా ముకర్రమా ప్రదేశంలో 'కాబాతుల్లా' వద్ద హజ్ జరుగుతుంది. హజ్ పేరుతో వెళ్లే యాత్రికులు మక్కా, ప్రవక్త రసూలుల్లా (సొల్లెల్లాహు అలైహి వసల్లం) జన్మస్థలం మదీనలో 40 రోజులు గడపాలి. నమాజ్, తవాఫ్, జికర్, దువా, ఖురాన్ పఠనం వంటి కార్యక్రమాలతో నిత్యం అల్లాహ్‌ను స్మరించుకోవడం, పండుగ రోజున ప్రత్యేక ప్రార్థనలు చేయడమే యాత్ర ప్రత్యేకత అని మౌల్వీలు చెబుతున్నారు. ప్రవక్తలు 'ఇబ్రహీమ్ ఖలీలుల్లా, ఇస్మాయిల్ జబీవుల్లా' త్యాగాలకు ప్రతీకగా చేసే హజ్ ఫరజ్ (తప్పని సరి)గా మారింది. రాష్ట్రంలో అత్యధిక ముస్లింలు ఉన్న ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఏటా వేల మంది ఈ యాత్రకు వెళ్తుంటారు. 2023 (1444 హిజ్రి)లో హజ్ చేసేందుకు వెళ్లే యాత్రకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రకటన జారీ అయింది.



మక్కాలో ప్రార్థనలు చేస్తున్న హాజీలు(ఫైల్)

హజ్ యాత్ర దరఖాస్తు ఇలా..

కర్నూలులోని బుధవారపేట మహబూబ్ సుబహాని మసీదులోని రాయలసీమ హజ్ సొసైటీ కార్యాలయంలో, పెద్ద మార్కెట్ సమీపంలోని అబుబక్కర్ మసీదులో ఉన్న జిల్లా హజ్ సొసైటీ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు ఉచితంగా పొందవచ్చు. అన్ని ధ్రువ పత్రాలు తీసుకెళ్తే అక్కడే కంప్యూటర్‌లో ఆన్‌లైన్ చేస్తారు. ఆన్‌లైన్, జిరాక్స్‌లు కూడా ఉచితంగా తీస్తారు. వివరాలకు హఫీజ్ మంజూర్ అహ్మద్ 94402 32564, మహమ్మద్ పాషా 99085 45232, ఎం. బాషా సాబ్ 99633 18255, అశ్ఫక్ హుసేన్ 98662 86786 నంబర్లను సంప్రదించవచ్చు.

చివరి తేదీ మార్చి 10

హజ్ దరఖాస్తుల స్వీకరణ ఇప్పటికే ప్రారంభమైంది. మార్చి 10వ తేదీలోపు పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు సొసైటీ కార్యాలయాల్లో రూ.300 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రత్యేక శిక్షణ ఇస్తాం



హజ్ యాత్రకు వెళ్లే వారికి సహాయ సహకారాలు అందించాలనే లక్ష్యంతో సొసైటీ ఏర్పాటు చేశాం. దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడంతో పాటు ఎంపిక, డబ్బులు ఎలా చెల్లించాలి, ఎప్పుడు లోపు చెల్లించాలి అని ప్రతి సమాచారం అందిస్తాం. ఎంపికైన వారికి ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తాం.

ఎ. హుసేన్, జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు

బుగ్గ సంగమేశ్వరంలో ముగిసిన ఉత్సవాలు



ఉత్సవమూర్తులకు పల్లకోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మద్దికెర: బుగ్గ సంగమేశ్వరంలో మూడు రోజులుగా జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. తెల్లవారుజామున స్వామివారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రదక్షిణ చేశారు. వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లను రాష్ట్ర విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబసమేతంగా సోమవారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారిచక్రపాణిరెడ్డి, ఈఓ ఎస్.లవన్న, అధికారులు, అర్చకులు ఆహ్వానం పలికారు. అనంతరం మంత్రి స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేద పండితులు ఆశీర్వచనాలు అందించగా, చైర్మన్, ఈఓ స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.



ఆలయ ఆవరణలో కుటుంబ సభ్యులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

అమ్మ భాషే అమృతం !

- ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే
- 2013లో రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న ఏకైక ప్రభుత్వ ఉద్యోగి
- నేడు మాతృభాష దినోత్సవం

కర్నూలు(అర్బన్): రాబోయే తరాలు కూడా మాతృభాషపై మమకారాన్ని పెంచుకోవాలనే తపన ఆయనలో ఎక్కువ. మమ్మీ, డాడీ, అంకుల్, ఆంటీ అనే ఆంగ్ల పిలుపులను సున్నితంగా తిరస్కరిస్తూనే ... అమ్మ, నాన్న, అత్త, మామ అనే పలకరింపులోని తియ్యదనాన్ని చిన్నారుల పెదవులకు అందించాలని పరితపిస్తుంటారు. పంచాయతీరాజ్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన జీవీ క్రిష్టారెడ్డి ప్రభుత్వంతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే జరుపుతున్నారు. దశాబ్దం క్రితమే అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు.

నందికొట్కూరు పట్టణానికి చెందిన గ్రంధే హనుమంతు, ఈశ్వరమ్మ దంపతులకు జన్మించిన క్రిష్టారెడ్డి ఎంఏ, బీఎడ్ పూర్తి చేసి కృష్ణగిరి మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. పదోన్నతిపై సీ బెళగల్, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి, కృష్ణగిరి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేస్తు ఇటీవలే కర్నూలు పీఐయూ కార్యాలయానికి పర్యవేక్షకులుగా బదిలీపై వచ్చారు. జెడ్పీలో పనిచేస్తున్న సమయంలో మాతృభాష పట్ల ఆయన చేస్తున్న కృషిని గుర్తించిన అప్పటి సీఈఓ సూర్యప్రకాష్ ఎంతో ప్రోత్సాహాన్ని అందించారు. జెడ్పీలోని ఉత్తర ప్రత్యుత్తరాలన్ని మాతృభాషలోనే స్వయంగా ఆచరించారు. తెలుగు భాష పట్ల ఆయనకున్న అంకితభావాన్ని గుర్తించి మాతృభాషా దినోత్సవం సందర్భంగా 2013 ఫిబ్రవరి 21వ తేదీన అప్పటి ప్రభుత్వం రాష్ట్ర స్థాయి పురస్కారంతో పాటు రూ.5 వేల నగదును అందించి సత్కరించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన ఈ కార్యక్రమంలో అప్పటి మాతృభాష సంఘం రాష్ట్ర అధ్యక్షులు మండలి బుద్ధ ప్రసాద్‌తో ఈ పురస్కారాన్ని క్రిష్టారెడ్డి అందుకున్నారు.

మధురమైనది మాతృభాష



పుట్టుకతో వచ్చిన అమ్మ భాషను మరచిపోతే మనుగడ ఉండదు. అమ్మ అనే పిలుపులో ఉన్న మాధుర్యం మరెందులోను లేదు. ఉన్నత విద్యలో ఇంగ్లిషు, హిందీ తదితర భాషలు అవసరమే. తల్లిదండ్రులు కూడా తమ చిన్నారులు ఆంగ్లంలో మాట్లాడుతుంటే సంబరపడుతూనే ... మారుతున్న కాలానికి అనుగుణంగా మాతృభాష పట్ల మమకారం పెరిగేలా కృషి చేయాలి.

– జీవీ క్రిష్టారెడ్డి

ఇద్దరు పిల్లలకు విషమిచ్చిన తండ్రి

- తాను కూడా తాగి ఆత్మహత్యాయత్నం
- కుటుంబ కలహాలే కారణం

తుగ్గలి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి భార్యతో గొడవపడి ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తాను పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తుగ్గలిలో చోటు చేసుకుంది. స్థానికులు అందించి సమాచారం మేరకు.. మండల పరిధిలోని చెన్నంపల్లికి చెందిన కోయిలకొండ తిమ్మప్పకు భార్య రామలక్ష్మమ్మ, రెండేళ్ల కుమారుడు తిమ్మరాజు, ఏడాదిన్నర కూతురు పల్లవి ఉన్నారు. బతుకుదెరువు నిమిత్తం నాలుగేళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ చిత్త కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగించే వారు. అయితే గత కొద్దిరోజులుగా భార్యతో గొడవ పడినట్లు సమాచారం. దీంతో తిమ్మప్ప పిల్లలను తీసుకొని రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన సోమవారం సాయంత్రం తుగ్గలి సమీపంలో పిల్లలకు కూల్‌డ్రింక్‌లో విషమిచ్చి, తాను తాగి గ్రామంలోకి వెళ్లి పురుగుల మందు తాగామని చెప్పాడు. దీంతో 108కు సమాచారం అందించి పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.





పత్తికొండలో చికిత్స పొందుతున్న చిన్నారి తిమ్మరాజు,చిన్నారి పల్లవి

వడదెబ్బతో వ్యక్తి మృతి



చంద్రమౌళి(ఫైల్)

కోవెలకుంట్ల: సంజామల మండలం రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సోమవారం వడదెబ్బతో మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన చంద్రమౌళి(36) పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మార్గ మధ్యలో దాహార్తితో స్పృహ కోల్పోయి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అటుగా వెళుతున్న రైతులు గమనించి చికిత్స నిమిత్తం పేరుసోముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

నేటి నుంచి జేఎంఎల్‌బీసీ సమావేశాలు

కర్నూలు(అగ్రికల్చర్): మండల స్థాయి బ్యాంకర్స్ కమిటీ(జేఎంఎల్‌బీసీ) సమావేశాలు ఈ నెల 21 నుంచి 24 వరకు మండల పరిషత్ కార్యాలయాల్లో జరగనున్నాయి. ఈ సమావేశాల్లో మండలస్థాయి అధికారులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొంటారు. ఈ సమావేశాల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన పథకాలను అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తారని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్(ఎల్‌డీఎం) వెంకటనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న ఉదయం ఆలూరు, మధ్యాహ్నం పత్తికొండ, 22న కర్నూలు, 23న ఉదయం ఆదోని, మధ్యాహ్నం మంత్రాలయం, 24న ఉదయం ఎమ్మిగనూరు, మధ్యాహ్నం కోడుమూరుల్లో జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.



ఉద్యోగం పేరుతో మోసం చేశారు!

- ఎస్పీని ఆశ్రయించిన బాధితులు
- పోలీసు స్పందనకు 103 ఫిర్యాదులు

కర్నూలు: ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేశారని పలువురు బాధితులు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 103 ఫిర్యాదులు వచ్చాయి. పశుసంవర్థక శాఖలో టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కర్నూలు నగరానికి చెందిన ఒక వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని నందికొట్కూరుకు చెందిన మౌలాలి ఫిర్యాదు చేశారు. హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కర్నూలు నగరానికి చెందిన ఒక వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని కర్నూలు నగరానికి చెందిన హేమంత్ కుమార్ ఫిర్యాదు చేశారు. రైల్వే డిపార్ట్‌మెంట్‌లో హోంగార్డు ఉద్యోగాలు ఇప్పిస్తానని ఒక వ్యక్తి మోసం చేశాడని కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన రాజారత్నం, కర్నూలు పట్టణానికి చెందిన ఫక్కీరయ్యలు ఫిర్యాదు చేశారు. కులం పేరుతో దూషిస్తూ ఒక వ్యక్తి బెదిరింపులకు పాల్పడుతున్నాడని కర్నూలు కృష్ణానగర్‌కు చెందిన శ్రీనాథ్ ఫిర్యాదు చేశారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నిటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ హామీ ఇచ్చారు. సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ డి.ప్రసాద్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు తదితరులు స్పందనలో పాల్గొన్నారు.



ఎస్పీకి సమస్యలు విన్నవిస్తున్న బాధితులు

స్టాంటన్‌పురం యూపీహెచ్‌సీ తనిఖీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని స్టాంటన్‌పురంలో ఏర్పాటు చేసిన యూపీహెచ్‌సీ (అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్)ను సోమవారం డీఎంహెచ్‌వో డాక్టర్ రామగిడ్డయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని రికార్డులు, మందులు, వైద్యపరీక్షల వివరాలను పరిశీలించారు. అనీమియా మానిటరింగ్ టూల్, ఆర్‌సీహెచ్ పోర్టల్, ఎన్‌సీడీ సర్వేలకు సంబంధించి ప్రగతిని సమీక్షించారు. గర్భిణీలను కాన్పు తేదీకి మూడురోజుల ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్‌రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.చక్రవర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉండి, 2022–23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే వారు దరఖాస్తులకు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ మొదలైందని, ఏప్రిల్ 30వ తేదీ వరకు చివరి గడువు ఉందని తెలిపారు. మే 10వ తేదీన పాలిసెట్ జరుగుతుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9949571971, 9705380486 నంబర్లను సంప్రదించవచ్చున్నారు.

23న ఎల్‌పీజీ బాట్లింగ్ ప్లాంట్‌లో మాక్‌డ్రిల్

కర్నూలు(సెంట్రల్): కల్లూరు మండలం లక్ష్మీపురంలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఎల్‌పీజీ బాట్లింగ్ ప్లాంట్‌లో ఈనెల 23వ తేదీన మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నామని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూపు సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పరిశ్రమల్లో అనుకోకుండా ప్రమాదాలు జరిగితే ఎలా ఎదుర్కోవాలో యజమానులు, వాటి లో పనిచేసే కార్మికులకు పూర్తిస్థాయి అవగాహన కోసం మాక్ డ్రిల్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాక్ డ్రిల్ నిర్వహణ సమయంలో సమీపంలోని ప్రజలను దూరంగా తీసుకొని వెళ్లడానికి రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. రెండు ఫైర్ ఇంజిన్లను సిద్ధంగా ఉంచుకోవాలని,ఆరు బెడ్లతో తాత్కాలిక ఆసుపత్రిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఐ.నారాయణరెడ్డి మాట్లాడుతూ.. అనుకోకుండా ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కోసమే మాక్ డ్రిల్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఫైర్ ఆఫీసర్ అవినాష్‌రెడ్డి, ఆర్‌డీఓ హరిప్రసాద్‌తోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు

